**Department of History**
**STSN Govt. Degree College, Kadiri**
**Anantapuram, Andhra Pradesh**

..........................................................................

**Students Study Projects**

# Topic: Tourist Places in Anantapuram Dist

**Group: II BA (HEP)**

**By**

**B.Venkatesh**

**A.Lokesh**

**A.Ramanjulu**

Scanned with CamScanner

# అనంతపురం జిల్లా సూక్ష్మ పరిచయం 

అనంతపురం జిల్లాకు కొన్నివేల సంవత్సరాల చరిత్ర వుంది. అనంతపురం పేరుతో పట్టణం నిర్మాణమైంది మాత్రం క్రీ.శ 1344-1377 మధ్యకాలంలో మాత్రమే. అప్పట్లో విజయనగర సామ్రాజ్యాన్ని బుక్కదేవరాయలు పాలించే వారు. వారి ఆస్థానంలో చిక్కప్ప ఒడెయర్ (చిక్క వడియర్) మంత్రిగా వుండే వారు. వారే ఒక పెద్ద చెరువును నిర్మించారు. చెరువుకు రెండు వైపులా రెండు గ్రామాలు నిర్మించారు. బుక్క రాయల పేరుతో బుక్కరాయ సముద్రం, రాయల భార్య పేరుతో అనంత సాగరం అను గ్రామాలు నిర్మించారట. క్రీ.శ. 1822 లో అనంతపురం జిల్లా ఏర్పడింది.


ఈ ప్రాంతం క్రీ.పూ 3 వ శతాబ్దంలో మౌర్య సామ్రాజ్యంలో వుండేదట. ఈ విషయం గుత్తికి సమీపంలోని ఎర్ర గుడి దగ్గర గల అశోకుని శిలా శాసనం ద్వారా తెలుస్తుంది. ఆ తర్వాత ఆంధ్రశాతవాహనులు పశ్చిమ చాళుక్యులు, రాష్ట్రకూటులు, పశ్చిమ గంగరాజులు, చోళులు హొయసలలు, ఢిల్లీ సుల్తానులు, విజయ నగర రాజులు, మరాఠీ సర్దారులు, హైదర్, టిప్పుసుల్తాన్, గోల్కొండ నవాబు పాలనలో వుండి 1800 సంవత్సరంలో బ్రిటిష్ వారికి సంక్రమించినట్లు చరిత్ర ఆధారాలు తెలుపుతున్నాయి. ఈ మండలం కీ.శ 1882 లో బళ్లారి జిల్లా నుండి వేరు చేయబడి అనంతపురం జిల్లాగా అవతరించింది. 1910 లో కడప జిల్లా నుండి కదిరి తాలూకాను 1953 బళ్లారి జిల్లా నుండి రాయదుర్గం తాలూకాను విలీనం చేసుకొని విస్తృతమైంది.

ఆంధ్ర ప్రదేశ్ జిల్లాలన్నింటిలో అనంతపురం అతి పెద్ద జిల్లా. దీని వైశాల్యం 19,130 చ.కి.మీ ఈ ప్రాంతం పరిపాలించిన ఎందరో రాజులు ఈ జిల్లాలో లెక్కలేనన్ని కోటలు, ఆలయాలు, శిల్ప కళా క్షేత్రాలు నిర్మించారు. ఈ ప్రాంతాన్ని పాలించిన విజయనగర రాజుల కాలాన్ని స్వర్ణయుగం అనవచ్చును. చెరువులు, కుంటలు, కాలువలను నిర్మించి రైతులకు తోడ్పడినారు. జానపద కళలను ప్రోత్సహించి ఆదరించారు. కవులను, పండితులను సత్కరించి గొప్పగా సాహిత్య సేవ చేశారు. అందుకే ఈ ప్రాంతం రాయల సీమగా పేరుకెక్కింది.

Scanned with CamScanner

# పెనుకొండ దుర్గం

చనిన నాళుల తెనుగు కత్తుల
సాన బెట్టిన బండ - యీ పెను
గొండ కొండ రంధ్రముల బ్రహ
రించు శత్రుల రక్త ధారలు.
త్రాగి త్రేచిన ఆంధ్ర కన్నడ
రాజ్యలక్ష్ముల అటిత నెలవు
దండ - యీ - పెనుకొండ.



పెనుగొండ

వెరపు తెరుగని బిరుదు నతకల విజయ నగరపు రాచ కొడుకుల పొదల బోయగ కరుడు గట్టిన పచ్చి నెత్తురు కంద - యీ పెనుగొండ కొండ అరుమ తేంద్రుని కీర్తి తేనెలు చెరగి దిగిన కాపు కవనపు నిరుపమ ద్రాక్ష రసంబులు. నిండి తొలకెడు కుండ యీ పెనుగొండ కొండ.

జిల్లాలోని గిరి దుర్గములలో పేరు గాంచినది పెనుగొండ దుర్గం. విజయ నగర రాజుల చరిత్రలో విశేష ప్రాముఖ్యం వహించినది పెనుగొండ దుర్గం. పెనుగొండను ఘనగిరి, ఘనాద్రి అని కూడా పిలుస్తారు. విజయ నగర రాజులలో కొంత మంది పెను-గొండను రాజధానిగా చేసుకొని పరిపాలించారు. శ్రీ కృష్ణదేవరాయలు వేసవి విడిదిగా పాలించారు. ఈ కోటను క్రియాశక్తి బడయార్ నిర్మించాడని కొందరు. హోయసల రాజులు నిర్మించి వుంటారని కొందరి అభిప్రాయం.

**గగన మహల్ :** పెనుకొండ కోటకే తలమానికమైనది గగన మహల్ నిర్మాణం. దీనిని కీ.శ 1575 లో నిర్మించినట్లు తెలుస్తుంది. ఇందులోనే శ్రీ కృష్ణ దేవరాయలు వేసవి విడిదిగా వుండే వారట. ఇందులో నుంచి కొండ పై గల కోటలోనికి రహస్య మార్గమున్నట్లు చెప్తుంటారు. ఇది బ్రిటీషు వారి స్వాధీనమైన తర్వాత 1872 లో


Scanned with CamScanner

బ్రిటీష్ ప్రభుత్వం ఇక్కడ న్యాయస్థానాన్ని ఏర్పాటు చేసినట్లు తెలుస్తుంది. స్వాతంత్ర్యానంతరం పెనుకొండ దుర్గం ఆంధ్రప్రదేశ్‌లో అంతర్భాగమైంది. ఇప్పుడీ గగన మహల్‌ను పర్యాటక శాఖవారు దర్శనీయ కేంద్రంగా వుంచారు.

గగన్ మహల్



పెనుకొండ దుర్గం రెండు ఆమడల వైశాల్యం గల బలిష్టమైన దుర్గరాజం 914 మీటర్ల ఎత్తు గల కొండపై నిర్మించ బడింది. దుర్గం చుట్టూ పెద్ద అగడ్త గుర్తుగా నేటికీ కనిపిస్తుంది. కోటకు నాలుగు ముఖద్వారాలు వున్నాయి. ప్రతి ద్వారము వద్ద ఆంజనేయ స్వామి విగ్రహ ముండటం విశేషం. ఈ దుర్గ ప్రాంగణంలో ఆనాడు 365 దేవాలయాలున్నట్లు చరిత్ర చెబుతుంది. వీటిలో కొన్ని మహమ్మదీయ రాజుల దండ యాత్రల కారణంగా పాడయినట్లు మరి కొన్ని అన్యాక్రాంతమయినట్లు తెలుస్తున్నది. ఇప్పటికీ బిక్క బిక్కు మంటూ కొండపై యోగ నరసింహ స్వామి దేవాలయం, చెరువుకు పోయే దారిలో కాశీ విశ్వనాథుని ఆలయం, ఆటుపక్క శ్రీ యోగ రామాలయం దర్శనిమిస్తాయి. ఈ ఆలయాలలో రామాయణ, భారత గాథలకు చెందిన అపురూప శిల్పాలున్నాయి.



Scanned with CamScanner

**తిమ్మరుసు బందిఖానా:** విజయనగర సామ్రాజ్య సంరక్షకుడైన తిమ్మరుసు మంత్రిని శ్రీకృష్ణ దేవరాయలు అప్పాజీ అని పిలిచేవారు.





అతనిపై రాయలకు అత్యంత గౌరవ భావముండేది. కానీ చెప్పుడు మాటలకు లోనై తిమ్మరుసు మహామంత్రిని అనుమానించి చెరసాలలో వుంచటం జరుగుతుంది. ఎలాంటి సదుపాయాలు లేని, సూర్యరశ్మి అయినా ధారాళంగా ప్రసరించని చీకటి కొట్టుగా నిర్మించిన బందిఖానాను దర్శించిన పర్యాటకుల కంట తడి పెట్టుకుంటూ వుంటారు. ఇది గగన్ మహాల్‌కు సమీపంగా ఎదురుగా నున్న బయలులో వుంది.

**తిమ్మరుసు సమాధి:** పెనుకొండకు దక్షిణాన వీరన్న కొండ దగ్గర రెండు సమాధులున్నాయి. అందులో ఒకటి తిమ్మరుసు మహామంత్రిది. మరొకటి తిమ్మరుసు తమ్ముడైన గోవిందరాజులది. వీటిని సందర్శించిన పర్యాటకులకు నాటి చారిత్రక కన్నీటి గాథలు జ్ఞాపకం వస్తాయి.

పెనుగొండ కోటలో పర్యాటకుల నాకర్షించే ఉయ్యాలగోపురం పసురాకెర్ర, పాలూకెర్ర అనే విశాలమైన బావులున్నాయి.

**పార్శ్వనాథ స్వామి దేవాలయం:**


సనాతన జైన సాంప్రదాయంలోని దిగంబర పంథాకు చెందిన దేవాలయమిది. ఈ దేవాలయం 12 వ శతాబ్దికి చెందినట్లుగా ఆలయంలోని శాసనం తెలుపుచున్నది. వర్తమాన కాల తీర్థంకరులలో 23 వ తీర్థంకరుడైన పార్శ్వనాథుడే ఈ ఆలయంలోని మూల విరాట్టు.




Scanned with CamScanner

పార్శ్వనాథుడు పుట్టుకతోనే హరిత వర్ణంలో (పచ్చరంగు) పుట్టినాడట అందుకే ఈ మూర్తికి ప్రాచుర్యమెక్కువ. ఉగ్ర వంశమునకు చెందిన ఈ తీర్థంకుడు వారణాశి పట్టణంలో జన్మించారు. బ్రాహ్మిలాదేవి, విశ్వసేన మహారాజు వీరి తల్లిదండ్రులు. ఈయన జైన తీర్థ క్షేత్రమయిన సమ్మేద శిఖర్జీ పర్వతములలో తపస్సు చేసి 3100 సం॥ల క్రితం ముక్తి పొందినట్లు తెలియుచున్నది. ఈ దేవాలయం పెనుకొండ కోటలో గగన్‌మహాల్‌కు వెళ్ళుమార్గంలో చూడ ముచ్చటగా వున్నది. అనేక విశాలమైన భావులు, జైన దేవాలయం ఆనాటి శిల్పకళా చాతుర్యానికి సాక్షిగా దర్శనమిస్తాయి.

**బాబా ఫక్రుద్దీన్ దర్గా :** హిందూ మహమ్మదీయ సఖ్యతకు చిహ్నంగా నిలచిన బాబయ్య దర్గా పర్యాటకులను, భక్తులను విశేషంగా ఆకర్షిస్తుంది.



ఊరికి తూర్పున కొద్ది దూరంలో హజరత్ బాబా ఫక్రుద్దీన్ అను ముస్లిమ్ సాధువు సమాధి అయినాడు. దీనితో పెనుగొండ దక్షిణ భారతదేశంలోని ముస్లిములకు పవిత్ర యాత్రా స్థలమైంది. ఆగష్టు మాసంలో ప్రతి ఏటా గంధం, ఉరుసు ఉత్సవాలు అత్యంత వైభవంగా జరుపుతారు. భారత దేశంలో పలు ప్రాంతాల నుంచి లక్షలాది హిందూ ముస్లిమ్ భక్తులు ఈ వేడుకలలో పాల్గొంటారు.



Scanned with CamScanner

రామశిలా : కోటపై అత్యంత సుందరోపేతంగా నిర్మించిన రామశిలా బురుజు శిథిలావస్థకు గురైంది పూర్తిగా నేల మట్టం కావడం మిగుల విచారకరం.

## కుంభకర్ణ ప్రాజెక్టు

ఆధునిక సమాజమును జాగృతి పరచుటకు పర్యాటకులను విశేషంగా ఆకర్షించుటకు వీలుగా నిర్మించిన ప్రాజెక్టు కుంభకర్ణుని నమూనా విగ్రహం. కుంభకర్ణుడు రామాయణంలో రావణాసురుని సోదరుడుగా మనకు బాగా పరిచయమే. ఇతడు సంవత్సరములో ఆరు నెలలు నిద్ర పోవడం, ఆరు నెలలు తిండి తినడంతో గడుపుతాడట. ఇతన్ని మేల్కొల్పడం అసాధ్యమే. అతని పేరుతో పర్యాటకులను విశేషంగా ఆకర్షించుటకు అనంతపురం - బెంగుళూరు జాతీయ రహదారిలో పెనుకొండ చేరుటకు ముందుగా ఏడు కిలోమీటర్ల దూరంలో కుంభకర్ణ ప్రాజెక్టు ఏర్పాటు చేసారు. దీని పక్కనే రైల్వే గేటు నాను కోని ఆంజనేయ స్వామి ఆలయముంది. 40 లక్షల రూపాయల వ్యయంతో అచ్చం కుంభకర్ణుడుగా వుండేలా సిమెంటుతో భారీనమూనా విగ్రహం చేసారు. వివిధ రంగులతో పర్యాటకులను బాగా ఆకర్షించే విధంగా తీర్చి దిద్దారు. నిద్రిస్తున్న కుంభకర్ణుని లేపడానికి రాక్షసులు వివిధ రకాలుగా చేసే ప్రయత్నాలను కళాకృతులుగా మలచారు. ఏనుగులతో తొక్కించడము, శూలాలతో పొడవడం, భయంకరంగా శబ్దాలు చేయడం వంటి దృశ్యాలు ఆనాటి పురాణ గాథలను గుర్తు చేస్తుంది. ఈ విగ్రహం 140 అడుగుల పొడవు, 40 అడుగుల వెడల్పు, 40 అడుగుల ఎత్తుతో నిర్మించారు. కుంభకర్ణ విగ్రహం పొట్టలో పెద్ద గదులున్నాయి. పర్యాటకుల సౌకర్యార్థం క్యాంటీన్ 6 గదులలో ఏర్పాటు చేసారు.

కుంభకర్ణుడు.




Scanned with CamScanner

పర్యాటకులను విశేషంగా ఆకర్షించుటకై ఈ విగ్రహం లోపల రామాయణ కథా ఘట్టాలను తెలియజేసే రంగుల చిత్రాలను ప్రదర్శించనున్నారు. విగ్రహం ముందు భాగంలో ఏర్పాటు చేసిన ఉద్యానవనం అద్భుతంగా వుంది. ఈ ఉద్యాన వనంను వృత్తాకారంలో ఏర్పాటు చేసారు. పది ఎకరాల విస్తీర్ణంలో ఈ ప్రాజెక్టు విస్తరించింది. జిల్లా కలెక్టరుగా పనిచేసిన శ్రీ సోమేష్ కుమార్ గారు ఈ ప్రాజెక్టు నిర్మాణానికి విశేషంగా తోడ్పడ్డారు.

## లేపాక్షి

ఆంధ్రప్రదేశ్ లో ప్రధానంగా చెప్పుకోదగిన పర్యాటక కేంద్రం లేపాక్షి. ఇది శిల్పకళలకు నిలయం చెక్కుచెదరని రంగు రంగుల చిత్రాలకు ఆలయం. భారతావనిలో గల 108 శైవ క్షేత్రాలలో లేపాక్షి ఒకటి. అనంతపురం, హిందూపురం ల నుంచి ప్రతి గంటకూ బస్సులు వుంటాయి. లేపాక్షి గ్రామంలో వూరి బయట 9 మీటర్ల పొడవు 6 మీటర్ల ఎత్తు గల నంది చూపరులను ఆకట్టుకుంటుంది

Lepakshi



లేపాక్షి లోని రాతి బసవన్నను చూసి పరవశంతో కళాతపసి అడవి బాపిరాజు అనుకవితా ధారగా దిగువ గీతం పాడారు.

లేపాక్షి బసవయ్య లేచి రావయ్యా
కైలాస శిఖరిలా కదలి రావయ్యా
హుంకరించిన దెసలు వ్రాగి పోయేను
ఖురములతో దువ్వితే కులగిరులు వణికెను. ॥లే॥

ఆకాశగంగకై అట్టెత్తి చూస్తేను
పొంగేటి పాల్కడలి గంగడోలాడెను ॥లే॥

నీలాల నీ చూపు నింగి మోసే కొమ్ము
తెలుగు నాటను పొంగు వెలుగులో యశములే ॥లే॥

నంది పర్వత జాత నవపినాకిని జలము
నీ మూర్ధమున బుట్టి నిత్య గంగానదీ ॥లే॥

నువు నడచిన భూమి నూరు పంటల చేలు
ముట్టె ముట్టిన పొదలు మొలకెత్తు ఓషధులు ॥లే॥


పెన్గొండ సీమలో బంగారు భూమిలో
నీ వంశ మీనాడు నిలచింది గర్వాన ॥లే॥

ఈ బసవన్న మెడలో చిరు గంటల మాల, పెను గంటల సింహ తలాటుపు పట్టీ ఎంతో సహజంగా చెక్కబడినాయి. గిట్టల తీరు, తోక మెలివేసుకున్న విధం. లేచి రావటానికి సిద్ధమవుతున్న భంగిమ వర్ణనాతీతం. ఒకే రాతిలో శయన రీతిలో చెక్కిన ఈ బసవయ్య చిత్రం రాయల సీమ శిల్ప కళా వైభవానికి సమగ్ర రూప కల్పం. శిల్ప కళా చరిత్రలోనే ఇదొక అపూర్వ సృష్టి.

విజయనగర సామ్రాజ్యంలో పెనుకొండ దుర్గంలో విరుపణ్ణ కోశాధికారిగా పని చేసేవారు.

Scanned with CamScanner

విరుపణ్ణ కోశాధికారిగా లేపాక్షిలో వీరభద్ర ఆలయాన్ని చక్కని శిల్పకళా నిలయంగా నిర్మించాలని సంకల్పిస్తాడు. చరిత్రలో శాశ్వతంగా వుండే విధంగా నిర్మించాలని ప్లానుకుంటాడు. అనూహ్య కారణాల వల్ల నిర్మాణం మధ్యలోనే ఆగిపోతుంది. విరుపణ్ణ రాజుగారి దురాగ్రహానికి లోనయి శిక్షింప బడతాడు.



ఆలయంలో వీరభద్ర ఆరాధ్య మంటపం, ముఖ మంటపం, మధ్యంతరంగా నిలిచిపోయిన కళ్యాణ మంటపాలు చూడదగిన వాటిలో ప్రధానమైనవి. ఈ ఆలయంలో ఆసక్తిగా చూసే ఒక దృశ్యం వుంది. అదే అంతరిక్ష స్తంభం ఇది భూమి మీద ఏ ఆధారం లేకుండా పై కప్పుని మాత్రమే ఆధారం చేసుకొని వుంటుంది. యాత్రికులను విశేషంగా ఆకర్షించే అతి బరువైన ఈ రాతి స్తంభం ఏ వాస్తు శాస్త్ర పరిశోధకునికీ అంతు చిక్కని మహోత్తర కళా సృష్టి

దేవాలయ పై కప్పు మీద చిత్రించిన భారత, రామాయణ మున్నగు కథా చిత్రాలు ఆశ్చర్యాన్ని కలిగిస్తాయి. ఆనాటి చిత్రకారుల నైపుణ్యం ఎంత ప్రతిభావంతమైనదో అర్థమవుతుంది.

ఏడు పడగల నాగస్వామి



నాట్య మంటపంలో బ్రహ్మ మద్దెల, తుంబురుడు వీణ, సూర్యుడు నాదస్వరం వాయిస్తుండగా భృంగీశ్వర, రంభ, నృత్య ప్రదర్శన లిస్తున్న దృశ్యాలు, పార్వతి ఈశ్వరునకు భిక్ష వేస్తున్న దృశ్యం. అశ్విని హస్తిని జాతి స్త్రీ మూర్తులు, దుర్గాదేవి స్వరూపాలు వర్ణనాతీతం.

Scanned with CamScanner

ఆలయ ప్రాంగణంలో ఒకే రాతిలో ఏడు పడగల నాగేంద్రుడు, నాగేంద్రుని పడగ నీడలో పానవట్టంతో కూడిన శివలింగమును నేర్పుతో చెక్కితమైనది.


ఇచట రామలింగేశ్వరుని శ్రీరాముడు, హనుమలింగాన్ని హనుమంతుడు ప్రతిష్ఠించగా పాప నాశేశ్వర స్వామి స్వయంభువుగా వెలసిందని చెబుతారు. ఇచట ప్రధాన క్షేత్రపాలకుడు వీరభద్రుడు. ఇచట యాత్రికుల సౌకర్యార్థం అతిథి గృహం కూడా వుంది. ఫలహారశాలలు, భోజన హోటళ్ళు కూడా వున్నాయి.

## శ్రీ లక్ష్మీనరసింహా స్వామి ఆలయం - కదిరి

శ్రీ ఖాద్రీ లక్ష్మీనరసింహ స్వామి క్షేత్రం పురాణ ప్రసిద్ధి చెందిన వైష్ణవ క్షేత్రం. ఈ స్వామిని దర్శించిన ఒక జానపద భక్తుడు పరవశుడై...

చేటాయి సామి దేవుడా - నన్నేలి నోడ "చేటాయి"
కాటమ రాయుడా - కదిరీ నరసింహుడా
నీటయిన వేట గాడ - నిన్నే నమ్మితిరా "చేటాయి"

అంటూ పాడిన దశావతార వర్ణనతో కూడిన జానపద గేయం నేటికీ ఆంధ్ర దేశమంతా ప్రతిధ్వనిస్తూనే వుంది. రాష్ట్రంలో అత్యంత ప్రసిద్ధి గాంచిన నవ నరసింహాలయాలలో ఇది ఒకటి. ప్రహ్లాద సమేతంగా నరసింహా స్వామి దర్శనం ఖాద్రీ క్షేత్రంలో తప్ప మరెక్కడా లేదు. ఈ స్వామి స్వయంభువుడు అంటారు. భక్త ప్రహ్లాదుని ప్రార్థన మన్నించి శ్రీ మహా విష్ణువు నరసింహా రూపంలో వెలసిన క్షేత్రమంటారు. గర్భ గుడి పశ్చిమ చాళుక్యుల కాలంలో నిర్మింప బడి నట్లు శాసనాధారాలు న్నాయి. విజయ నగర రాజులు



Scanned with CamScanner

# వేమన సమాధి, ఆలయం - కటారుపల్లి

భక్తి, ముక్తి, శక్తులను ప్రసాదించి మాన వాళికి ఆరాధ్యులైన త్రిమూర్తులే శ్రీ రాఘవేంద్ర, శ్రీ వీరబ్రహ్మ, శ్రీ యోగి వేమనలు. వీరు వారి వారి సిద్ధాంతాలతో, తత్త్వాలతో, పద్యాలతో జాతిని మేల్కొల్పిన మహానీయులు. ఈ మహానీయులు ముగ్గురు రాయలసీమ లోని కర్నూలు జిల్లాలోని మంత్రాలయంలో శ్రీ రాఘవేంద్రులు కడప జిల్లాలోని కందిమల్లాయ పల్లెలో శ్రీ వీరబ్రహ్మేంద్రులు, అనంతపురం జిల్లాలో కటారు పల్లెలో శ్రీ యోగి వేమన జీవ సమాధిని పొందిన జీవన్ముక్తులు.


యోగివేమన సంస్కరణ వాది కూడా. చిన్న చిత్తనమంతా పద్యాంలో మహావృక్షమంత భావమును ఇమిడ్చిన మహా మేధావి. మూడు పాదాలలో (పద్యం) మూడు లోకాలకు విస్తరించిన మహా భావుకులు వేమన మహాకవి.

వేమన జనన, నిర్యాణ ప్రాంతాలను గూర్చి చరిత్రకారులలో ఏకాభిప్రాయం లేదు. ఏదైనా వేమన ఏ ప్రాంతం వాడయిన అంత్యదశలో అనంతపురం జిల్లా కదిరి సమీపం గల కటారుపల్లెలో జీవ సమాధి పొందినాడని ఈ ప్రాంతీయుల విశ్వాసం.

కటారుపల్లెలో వేమన జీవసమాధి వుంది. ఇది 16వ శతాబ్దం నాటిదని చారిత్రక ఆధారంగా చెబుతారు. ఈ సమాధి పైన ఆలయాన్ని నిర్మించారు. ప్రతిదినం పూజలు జరుగుతుంటాయి. పర్యాటకులు రోజూ పలు ప్రాంతాల నుంచి విచ్చేసి దర్శిస్తూ వుంటారు. దీనిని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి పరచుటకు ప్రభుత్వం మూడు కోట్ల రూపాయలు విడుదల చేసింది. ఈ ఆలయంలో వేమన విగ్రహాన్ని కూడా ప్రతిష్ఠించారు. ప్రతి ఏటా ఉగాది పండుగ అనంతరం కటారుపల్లెలో వేమన తిరునాల నిర్వహిస్తారు. ఆ దినం పలు ప్రాంతాల నుంచి విచ్చేసిన భక్తాదులు ఈ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. తిరునాల సమయంలో వేమన

Scanned with CamScanner

# కటారుపల్లి



ఆలయంలో మొక్కబడుల కోసం ఏర్పాటు చేసిన బాండిని బంత్లు భక్తులను ఎంతగానో ఆకట్టుకుంటాయి. కటారు పల్లి గాండ్లపెంట మండలంలో వుంది.

ప్రపంచంలోని పలు బాషలలో వేమన పద్యాలు అనువదింప బడినాయి. వేమన పద్యాలు రాని తెలుగు వాడుంటాడంటే అతిశయోక్తి ఏమీ కాదు.


"అంతరంగమందు నపరాధములు చేసి
మంచివారి వలెను మనుజులుందు
ఇతరు లెరుగకున్న నీశ్వరుడెరుగడా
విశ్వదాభి రామ వినుర వేమ ||"

## తిమ్మమ్మ మర్రిమాను - గూటి బయలు:

తిమ్మమ్మ మర్రిమాను అంటూనే తిమ్మమ్మ పేరుతో వెలిసిన మర్రిమానని అర్థమవుతుంది. ప్రపంచంలోనే అతి పెద్దదయిన ఈ మర్రిమాను 5.2 ఎకరాల విస్తీర్ణంలో వ్యాపించింది. గూటిబైలు గ్రామంలో ఈ మర్రిమాను దర్శనమిస్తుంది. కోల్‌కత్తా బొటానికల్ గార్డెన్స్, చెన్నై అడయారులోని మర్రిమాను రెండింతలు పెద్దది. 1989 లో ప్రపంచ రికార్డులను బద్దలు కొట్టి గిన్నిసు బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో తన స్థానాన్ని స్థిరపరచుకుంది.

ఈ మర్రిమానుకు 550 సంవత్సరాల వయస్సు వుందని సుమారు 1100 ఊడలు ఈ వృక్షానికి వున్నట్లు బొటానికల్ సర్వే ఆఫ్ ఇండియా, బెంగుళూరు తన సర్వేలో తెలిపింది.

తిమ్మమ్మ మర్రిమానని ప్రసిద్ధికెక్కడానికి ఒక కథ బహుళ ప్రచారంలో వుంది. క్రీ.శ 1394 లో అనంతపురం జిల్లాలోని బుక్కపట్నం అనే గ్రామంలో చిన్న వెంకటప్ప, మంగమ్మ అనే దంపతులుండేవారు. వారి కూతురే తిమ్మమ్మ. తిమ్మమ్మను గూటి బయలు గ్రామానికి చెందిన బాల వీరయ్యకు ఇచ్చి పెండ్లి చేశారు. 1434 లో బాల వీరయ్య దీర్ఘరోగంతో మరణించాడు. బాల వీరయ్య భార్య తిమ్మమ్మ అతనితో పాటూ సహగమనం



చేసింది. చితి ఎదుట వుంచేక్కె నాటిన మర్రి కొమ్మలలో ఈశాన్య దిక్కున వున్న కొమ్మ చిగిర్చి రెమ్మలు వేసి కొమ్మలుగా విస్తరిల్లి మహావృక్షమయింది. ఈ వట వృక్షానికి మొదలు ఎక్కడ వుందో ఎవరూ కనిపెట్టలేరు. ఆనాటి నుంచి గ్రామస్థులు దానిని తిమ్మమ్మ మర్రిమాను అని పిలుస్తున్నారు.

Scanned with CamScanner

# మన్రో ప్రభువు - వారి జ్ఞాపక చిహ్నాలు : గుత్తి

దత్త మండలాలకు తొలి కలెక్టరయిన సర్ థామస్ మన్రోను ప్రజలంతా మన్రో ప్రభువుగా భావించి పిలిచే వారు. వీరు దత్తమండలాలకు చేసిన సేవలు చిరస్మరణీయం. 30 వేల మంది సైనిక బలగం 80 మంది పాలెగాళ్లను అణచివేసి శాంతి నెలకొల్పారు. పన్ను చెల్లింపులో జమిందారి విధానాన్ని రద్దు చేసి రైతువారి విధానం అమలు చేశారు. ప్రతి



ఉద్యోగి తెలుగు విధిగా నేర్చుకోవాలని శాసించారు. 1805 నాటికి ఆయన స్వయంగా తెలుగు రాయటం, చదవటం నేర్చుకున్నారు. పటిష్టమైన పాలన అందించేందుకు మన్రో దత్త మండలాలను 37 తాలూకాలుగా విభజించి బళ్లారి, కడప, కాకికొండలలో కలెక్టర్ కార్యాలయాలను ఏర్పాటు చేశారు. ప్రధాన జిల్లా కార్యాలయం అనంతపురంలో వుండేది. 1801, 1802 లో క్షామ సమయంలోను 1803 లో అతివృష్టి ఏర్పడినపుడు మన్రో రైతులకు, ప్రజలకు అండగా నిలిచారు. బయలు స్థలాల్లో చింత చెట్లను నాటించి బాటసారులకు నీడను సేదను తీర్చే విశ్రాంతి స్థలాలు గానే గాక ఫలసాయమూ, వర్షాలు కురవడానికి అనుకూలం చేశారు. అందుకే ప్రజలంతా వీరిని మన్రో ప్రభువని పిలిచే వారు. ఆరాధించే వారు.



మన్రో సత్రం: మన్రోప్రభువు పై ప్రజలకు గల భక్తి గౌరవాలకు గుర్తుగా గుత్తి పట్టణంలో వారి జ్ఞాపకార్థం పెద్ద సత్రం ఏర్పాటు చేశారు. ఇంతటి పెద్ద సత్రం రాయలసీమలో ఎక్కడా అగుపించదు.